క్లుప్తంగా

ఐయామ్ విత్ వైఎస్సార్ సీపీ పోస్టర్ ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వం తీరుతో వైఎస్సార్ సీపీకి రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, రాంబాబు దంపతుల కుమారుడు యశ్వంత్ ఆధ్వర్యంలో రూపొందించిన ఐయామ్ విత్ వైఎస్సార్ సీపీ పోస్టర్‌ను ఇబ్రహీంపట్నంలో గురువారం రాత్రి విద్యార్థి సంఘాల సమక్షంలో జోగి రమేష్ ఆవిష్కరించి మాట్లాడారు. మేము కూడా వైఎస్సార్ సీపీతో ఉన్నామంటూ తెలియజేసే కార్యక్రమమే ఐ యామ్ విత్ వైఎస్సార్ సీపీ కార్యక్రమం అన్నారు. యువతను వైఎస్సార్ సీపీ వైపు ఆకర్షించేందుకు విద్యార్థి సంఘాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గరికపాటి రాంబాబు, పలు విద్యార్థి సంఘాల నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మైలవరం: మైలవరం మండలం వెల్వడం గ్రామం లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. సుమారు 1200 మందికి పైగా మజ్జిగ పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు.

బిల్డర్స్ అసోసియేషన్ స్టేట్ వైస్ చైర్మన్‌గా బండి పవన్



నూజివీడు: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ స్టేట్ వైస్ చైర్మన్‌గా నూజివీడుకు చెందిన ప్రముఖ బిల్డర్ బండి పవన్ ఎన్నికయ్యారు. గత పదిహేనేళ్లుగా బండి పవన్ భవన నిర్మాణ రంగంలో కార్మికుల సంక్షేమానికి విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా బండి పవన్‌ను బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు విజయవాడ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఘనంగా సత్కరించారు.

సహజ పానీయాలు మేలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కూల్ డ్రింక్స్ మానేద్దాం, సహజ పానీయాలు తాగుదాం వాల్‌పోస్టర్‌ను కొండపల్లిలో శుక్రవారం ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, కొండపల్లి శాఖ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మామిడి సీతారామారావు మాట్లాడుతూ నేటి తరం కూల్ డ్రింక్స్‌కు అలవాటుపడి వ్యాధులను కొనితెచ్చుకుంటున్నారన్నారు. వీటిలో పోషక విలువలు ఉండవన్నారు. దీర్ఘకాలంగా తాగితే మధుమేహం, కిడ్నీ, జీర్ణవ్యవస్థలో సమస్యలు ఉత్పన్నమవుతాయని వెల్లడించారు. నిమ్మరసం, చెరకు రసం, కొబ్బరినీరు, గంజి, మజ్జిగ, రాగి జావ, పానకం వంటి సహజ పానీయాలు సేవించడం మేలని చెప్పారు. సభ్యులు ప్రసాద్, సర్దార్ సాహెబ్, సీహెచ్ మురళి, యలమందయ్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



మైలవరం: అగ్నిప్రమాదాల నియంత్రణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి ఎం.గౌతమ్ అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా మైలవరం శ్రీసాయి నమిత భారత్ గ్యాస్ గోడౌన్, సాయి వెంకట కృష్ణ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద శుక్రవారం అవగాహన కల్పించారు. గ్యాస్ గొడౌన్, పెట్రోల్ బంక్‌ల వద్ద ప్రమాదాలు జరిగితే వెంటనే ఎలా స్పందించాలనే విషయాన్ని ఫైర్ సిబ్బంది డెమో ద్వారా చూపించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ ఇన్‌చార్జి ప్రసాద్, ఎస్. రవిబాబు, డ్రైవర్ ఆపరేటర్ వి.ఉదయ్‌కుమార్, ఫైర్‌మెన్‌లు వెంకటేష్ నాయక్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో దాహం కేకలు

- పైపులైన్ పగిలి నిత్యం మరమ్మతులతో నీటి సరఫరాలో జాప్యం
- ప్రతిపాదనల దశలోనే నూతన పైపులైన్ ఏర్పాటు
- ఏడు గ్రామాల్లో రోజుకి 4 లక్షల లీటర్ల నీరు వినియోగం
- రూ.3.30 కోట్లతో ప్రతిపాదనలు పంపిన అధికారులు



జి.కొండూరు మండలంలోని లోయ గ్రామాలకు కృష్ణావాటర్ సరఫరా చేసే ప్రధాన పైపులైను మరమ్మతుల కోసం తవ్విన గుంతలు



గడ్డమణుగు గ్రామంలో డ్రెయినేజీలో ఉన్న కృష్ణా వాటర్ పైప్ లైన్ ఎయిర్ వాల్

జి.కొండూరు: దశాబ్దాల కిందట వేసిన పైపులు పగిలిపోతున్నాయి.. మరమ్మతులతో నీటి సరఫరాలో జాప్యం.. పెరిగిన నీటి వినియోగం వెరసి జి.కొండూరు మండలంలోని లోయ గ్రామాల ప్రజలను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఏ క్షణం నీళ్లొస్తాయో, ఎప్పుడు ఆగిపోతాయో తెలియక తాగునీటి కోసం ప్రజలు ఎదురు చూడాల్సి వస్తోంది. నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో లోయ గ్రామాల ప్రజలు తాగునీటి కోసం నరకయాతన పడాల్సి వస్తోంది.

ప్రతిపాదనల దశలోనే పైప్‌లైన్

జి.కొండూరు మండల పరిధిలోని జి.కొండూరు నుంచి లోయ గ్రామాలైన గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు వరకు 11 కిలోమీటర్ల మేర కృష్ణా వాటర్ పైప్‌లైన్ ఉంది. ఈ గ్రామాలకు ప్రతి రోజూ 4 లక్షల లీటర్ల వరకు తాగునీరు సరఫరా అవుతోంది. ఈ పైప్‌లైన్ దశాబ్దాల కిందట ఏర్పాటు చేసింది కావడంతో నీటి సరఫరాలో సమస్య తలెత్తుతోంది. జి.కొండూరు నుంచి గంగినేని వరకు రహదారి విస్తరణ పనులు కూడా జరుగుతున్న క్రమంలో నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు అధికారులు రూ.3.30 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపారు. రహదారి విస్తరణ పనులు ప్రారంభమై 50 శాతం పూర్తయినప్పటికీ పైప్‌లైన్ ఏర్పాటుకు నిధులు విడుదల కాకపోవడంతో పైప్‌లైన్ ఏర్పాటు ఆగిపోయింది. ఈ క్రమంలో ఈ పదకొండు కిలోమీటర్ల మేర ప్రధాన పైప్‌లైన్ అస్తమానం పగిలిపోయి మరమ్మతులు చేస్తుండడంతో నీటి సరఫరాలో జాప్యం జరుగుతోంది. ఏ సమయంలో తాగునీరు వస్తుందో తెలియక ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. పైపులు పగిలిన ప్రదేశంలో మరమ్మతులు చేపట్టి గుంతలను రోజుల తరబడి అలానే వదిలేయడంతో లీకైన నీరు మురుగు నీరుగా మారి నీటి సరఫరా ఆగినప్పుడు పైపుల్లోకి చేరి తాగునీరు కలుషితమవుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు మంజూరు చేస్తే తమకు తాగునీటి కష్టాలు తప్పుతాయని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నీళ్లు ఎప్పుడొస్తాయో తెలియట్లేదు



కృష్ణా వాటర్ కోసం ప్రతి రోజూ ఎదురుచూడక తప్పడంలేదు. ఒక రోజు వస్తే ఒక రోజు రావట్లేదు. అదేంటని అడిగితే పైపులు పగిలాయని చెబుతున్నారు. ఒక్కో రోజు నీళ్లు ఏ టైంలో వస్తాయో కూడా తెలియక ఇబ్బంది పడుతున్నాం. అసలే ఎండా కాలం కావడంతో తాగునీటి కోసం నరకయాతన పడుతున్నాం.

– రమావతు తిరుపతిరావు, మునగపాడు

పని మానుకోవాల్సి వస్తోంది



కృష్ణా వాటర్ కోసం పని మానుకొని ఎదురు చూడాల్సి వస్తోంది. ప్రతి రోజూ పైపులు పగిలి నీరు సక్రమంగా రావడంలేదు. తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నాం. కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే మాకు తాగునీటి కష్టాలు తప్పుతాయి. ఎండా కాలం కావడంతో తాగునీరు ఎక్కువ అవసరం అవుతుంది.

– లావూరి గోపి, మునగపాడు గ్రామస్తుడు

ప్రతిపాదనలు పంపాం

జి.కొండూరు నుంచి లోయ గ్రామాలకు కృష్ణా వాటర్ సరఫరా కోసం నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.3.30 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే వెంటనే పనులు ప్రారంభిస్తాం. ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా తాగునీరు సరఫరా చేస్తున్నాం.

– ఎం.దయానంద్, కృష్ణా వాటర్ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ ఏఈ

మానవాళి రక్షణకు సిలువపై బలియాగం

- భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే
- చర్చిలు, ప్రార్థనా మందిరాలో ప్రత్యేక ప్రార్థనలు
- పలుచోట్ల సిలువమార్గం



మైలవరం ఆర్‌సీఎం చర్చి వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్

తిరువూరు/మైలవరం/నూజివీడు: మానవులందరినీ పాపం నుంచి రక్షించేందుకు ఏసుక్రీస్తు సిలువపై ప్రాణాలు అర్పించి బలియాగం చేశారని పలువురు పాస్టర్లు అన్నారు. గుడ్ ఫ్రైడే ప్రార్థనలు తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వాసులు ఉపవాసం ఉండి ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాస్టర్లు ప్రసంగిస్తూ గెత్సేమనే నుంచి గొల్గొతా వరకు సిలువ యాత్ర, సిలువపై ఏసుక్రీస్తు శ్రమలను వివరించారు. ఏసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను ధ్యానించారు. క్రీస్తు మార్గాన్ని అనుసరించి ప్రతి ఒక్కరూ సత్య మార్గంలో జీవించాలని పేర్కొన్నారు. సిలువమార్గం నిర్వహించారు.

త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే

తిరువూరు: ఏసుక్రీస్తు త్యాగానికి ప్రతీకగా నిలిచిన రోజు గుడ్ ఫ్రైడే అని తిరువూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ విజయ కుమార్ అన్నారు. తిరువూరు డివిజన్‌లోని పలు చర్చిలలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, సిలువ మార్గం నిర్వహించారు. తిరువూరు ఆర్‌సీఎం చర్చి పరిధిలోని పలు గ్రామాల విశ్వాసులు అధిక సంఖ్యలో సిలువ మార్గంలో పాల్గొన్నారు. మధిర రోడ్డు నుంచి బస్టాండు సెంటర్ వరకు సిలువ మార్గం జరిపిన సందర్భంగా విజయకుమార్ క్రీస్తును సిలువ వేసిన ఘటనను వివరించారు. మానవాళిపైన, నిస్సహాయులపై కరుణ, శత్రువులపై క్షమ చూపుతూ ఏసుక్రీస్తు విశ్వవ్యాప్తంగా శాంతి సందేశాన్నిచ్చారని వివరించారు. తిరువూరు సీఎస్ఐ రాజుపేట, టౌన్ చర్చిలలో, గంపలగూడెం మండలం పెనుగొలను ఆర్‌సీఎం చర్చిలో, రోలుపడి, మల్లేల సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు జరిగాయి.

శత్రువులపై కూడా ప్రేమ చూపాలి..

మైలవరం: మైలవరం శుద్దిపేటలోని ఆర్‌సీఎం చర్చి నుంచి గ్రామంలోని ప్రధాన రహదారుల్లో క్రైస్తవులు సిలువ మోస్తూ క్రీస్తు సందేశాన్ని తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ విశ్వాసులు శత్రువులను కూడా ప్రేమతో క్షమించాలని, దయా, క్షమ గుణం కలిగి ఉండాలని ఏసు క్రీస్తు బోధించారని వివరించారు. క్రీస్తు సిలువపై మరణం, పునరుద్దానం ఈ రెండూ కూడా సర్వ మానవాళి చరిత్రను మలుపు తిప్పిన ఘట్టాలని వివరించారు. లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ సిస్టర్స్, విశ్వాసులు పాల్గొన్నారు.

- మైలవరం: రెడ్డిగూడెం మండలం వెలగలగూడెం ఆర్‌సీఎం విచారణ దేవాలయంలో గుడ్ ఫ్రైడేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తు శిలువను భుజంపై మోస్తూ క్రైస్తవులు వెలగలగూడెం వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ దానియేలు గుడ్ ఫ్రై డే విశిష్టతను వివరించారు.
- ఇబ్రహీంపట్నం: కొండపల్లి, ఇబ్రహీంపట్నం, మూలపాడు ఆర్సీఎం చర్చిలు, సీఎస్ఐ చర్చిల్లో సిలువ మార్గం నిర్వహించారు. ఫాదర్ బి.అనిల్ కుమార్ క్రీస్తు సందేశమిచ్చారు. మూలపాడు ఆర్సీఎం విచారణ చర్చిలో ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రైస్తవుల మధ్య సిలువ మోశారు.
- జి.కొండూరు: మండలంలోని అన్ని గ్రామాలలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు చర్చిలలో జరిగాయి. జి.కొండూరు సీఎస్ఐ చర్చిలో పాస్టర్ ఎం.జాన్ కోటేశ్వరరావు, ఆర్సీఎం చర్చిలో ఫాదర్ మేడేపల్లి థామస్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను పాస్టర్లు వివరించారు.
- తిరువూరు: ఎ.కొండూరు మండలం కంభంపాడులో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు జరిగాయి. ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ బుంగా సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం గుడ్‌ఫ్రై డే ప్రాశస్త్యాన్ని వివరించారు. చర్చి నుంచి ప్రధాన వీధుల గుండా పరిశుద్ధ సిలువ మార్గాన్ని నిర్వహించారు. కంభంపాడు సర్పంచి కోట పుల్లారావు పాల్గొన్నారు. విస్సన్నపేట మండలంలోని చర్చిల్లో పార్థనలు, సిలువమార్గం నిర్వహించారు.
- ఆగిరిపల్లి: మానవాళి పాప పరిహారార్థం క్రీస్తు సిలువ మరణం పొందారని పాస్టర్ కొల్లూరు ఐజాక్‌జాన్ అన్నారు. మండలంలో శుక్రవారం గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆగిరిపల్లిలో బెత్లహాం చర్చిలో పాస్టర్ నిరీక్షణ కుమార్, కనసానపల్లి, అడవినెక్కలం సీఎస్ఐ చర్చి, పాస్టర్ శశిధర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజవరం ఆర్‌సీఎం చర్చి నుంచి ఆగిరిపల్లి వరకు పాస్టర్ అల్లం ప్రతాపరెడ్డి, జోష్ ఆధ్వర్యంలో సిలువ ర్యాలీ నిర్వహించారు.
- ముసునూరు: ముసునూరు, రమణక్కపేట, కాట్రేనిపాడుల్లో ఫాదర్లు జోసెఫ్ తంబి, జాన్ భారతి, ఇమ్మానుయేలు, విలియమ్స్, ఇలవర్సన్, జోయ్‌అమల్, క్లారెడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. చింతలవల్లి, వేల్పుచర్ల, యల్లాపురం, కాట్రేనిపాడు, లోపూడి, వలసపల్లి, చెక్కపల్లి ఆర్‌సీఎం సంఘాల్లో సిలువ మార్గం నిర్వహించారు. ఉపదేశులు దేవరపల్లి బెనర్జీ, దేవకుమార్, స్వామిదాసు, లాజరస్, దీక్షాధారులు పాల్గొన్నారు.
- చాట్రాయి: శుభ శుక్రవారాన్ని మండలంలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చనుబండ, చాట్రాయి, కోటపాడు ఆర్‌సీఎం చర్చిల్లో సిలువయాత్ర నిర్వహించారు. చనుబండ, పోలవరం, పోతనపల్లి, సూరంపాలెం, నరసింహారావుపాలెం గ్రామాల్లోని సీఎస్ఐ చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు.
- మల్లేల(తిరువూరురూరల్): సర్వమానవాళి రక్షణార్థం ఏసుక్రీస్తు తన రక్తాన్ని చిందించారని మల్లేల సీఎస్ఐ చర్చి పాస్టర్ భాస్కరరావు అన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా సంఘ సభ్యులు గ్రామంలో సిలువయాత్ర భక్తిశ్రద్ధలతో జరిపారు. గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను పాస్టర్ వివరించారు. చర్చి కమిటీ అధ్యక్షుడు వరికూటి ప్రసాద్, కార్యదర్శి అర్జున్, సభ్యులు పాల్గొన్నారు.
- నూజివీడు: పట్టణంతో పాటు మండలంలో శుక్రవారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడేను నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సిలువ మార్గం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఫాదర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, శాంతి, ఓర్పులతో జీవనం సాగించడమే క్రీస్తు సందేశమన్నారు.



మల్లేలలో సిలువమార్గం



ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన సిలువ మార్గంలో భక్తులు



నూజివీడులో ఏసు క్రీస్తు ప్రతిమతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు



గంపలగూడెం మండలం పెనుగొలనులో సిలువ మార్గం



చాట్రాయిలో సిలువపై ఏసుక్రీస్తు వేషధారణతో విశ్వాసులు



తిరువూరు ఆర్‌సీఎం చర్చి విశ్వాసుల సిలువ మార్గం



ముసునూరులో సిలువ మోస్తున్న ఫాదర్ జోసెఫ్ తంబి



ఎ. కొండూరు మండలం కంభంపాడులో సిలువమార్గంలో పాల్గొన్న విశ్వాసులు

వర్షాలు, తెగుళ్లతో మామిడి రైతులకు తీవ్ర నష్టం

ఖర్చులు కూడా రాని వైనం



తిరువూరు మండలం కాకర్ల సమీపంలో జాతీయ రహదారి వెంబడి కుప్పలుగా పోసిన మామిడికాయలు

తిరువూరు: ఇటీవల వారంలో రెండుసార్లు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలకు వడగండ్ల వాన తోడవడంతో తిరువూరు డివిజన్‌లో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అంతంతమాత్రంగా కాసిన మామిడి కాయలు ప్రకృతి ప్రకోపంతో పూర్తిగా నేలరాలాయి. వడగండ్ల దెబ్బకు మంగుతెగులు సోకిన మామిడికాయలు కొనేవారు లేక రైతులు దిక్కుతోచక అల్లాడుతున్నారు. సీజన్ ప్రారంభం నుంచి వాతావరణ ప్రతికూలతతో కాయతొలుచు పురుగు, తామర, నల్లి తెగులు, తేనెమంచు, రాతిమంగు తదితర తెగుళ్లు సోకి పిందెదశలోనే రాలిపోవడంతో రైతులు ఉన్న కొద్దిపాటి పంటను రక్షించుకునేందుకు అధిక వ్యయప్రయాసల కోర్చి సస్యరక్షణ చర్యలు చేపట్టారు. ఎకరాకు రూ.40 వేలకు పైగా పురుగు మందుల పిచికారీకే ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. నిలబడిన కొద్దిపాటి కాపు సైతం భారీ వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్ల వానతో చేతికందకుండా పోవడంతో లక్షలాది రూపాయలు నష్టపోయామని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. కుళ్లిపోయిన మామిడికాయలను కుప్పలుగా రోడ్ల వెంబడి పారబోస్తున్నారు.

అంటరాని విశ్వ విజేత గ్రంథం ఆవిష్కరణ



మైలవరం: భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితాన్ని గ్రంథం రూపంలో తీసుకువచ్చిన అధ్యాపకులు డాక్టర్ దేవానంద్ అభినందనీయులని ప్రవాసాంధ్రులు, కళాశాల భవన నిర్మాణ దాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ మెండా దేవానంద కుమార్ రచించిన అంటరాని విశ్వ విజేత గ్రంథాన్ని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. హనిమిరెడ్డి మాట్లాడుతూ గత ఏడాది తన జీవిత చరిత్ర వెల్వడం నుంచి అమెరికా వరకు అనే గ్రంథాన్ని చాలా చక్కగా రచించారన్నారు. రెండో గ్రంథంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత గ్రంథాన్ని రచించడం ప్రశంసనీయమన్నారు. ఎల్‌బీఆర్‌సీఈ చైర్మన్ జి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పుస్తక రచన ఎంతో కష్టమైన పని అన్నారు. ఈ గ్రంథాన్ని చదివిన వారు ఎన్నో విషయాలు తెలుసుకుని, జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని నిరసన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): లౌకిక విలువలు, మైనార్టీల హక్కులు హరిస్తున్న వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్ చేశారు. కొండపల్లి ముషాయిక్ మసీదు వద్ద వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముస్లింలకు మద్దతు తెలిపిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ హిందుత్వ అజెండా అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ముస్లింలపై విద్వేషం చిమ్ముతుందన్నారు. లవ్ జిహాద్, ఘర్వాపసీ, కామన్ సివిల్ కోడ్, మసీదుల విధ్వంసం, మూకహత్యలతో హిందుత్వ శక్తులు దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. ఇది భారత ప్రజలను మత పరంగా విభజించే కుట్ర అన్నారు. వక్ఫ్ సవరణ చట్టం వక్ఫ్ ఆస్తులు కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని మండిపడ్డారు. బిల్లుకు మద్దతు ఇచ్చిన టీడీపీ, జనసేన విధానం లౌకికతత్వానికి విఘాతం కలిగించాయని విమర్శించారు. ముస్లిం పెద్దలు ఇంతికాబ్ రజ్వీ, షేక్ బాష, అహ్మద్, బాబు, సుభానీ, సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

రైతులను దోపిడీ చేస్తున్న మిల్లర్లు

వ్యవసాయ కార్మిక సంఘం నేత సీహెచ్‌కోటేశ్వరరావు ధ్వజం



మైలవరం: ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురు గాలులు వరి, మొక్కజొన్న, మామిడి రైతులను నట్టేట ముంచాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర నాయకుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. ఆపదలో ఆదుకోవాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదని, ఇదే అదునుగా మిల్లర్లు, దళారీలు ఏకమై తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆదుకోవాలని కోరారు. గాలివానలకు రైతులు తీవ్రంగా నష్టపోయిన రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలోని గ్రామాల్లో కోటేశ్వరరావు శుక్రవారం పర్యటించారు. రైతులు రోడ్లపై ఆరబెట్టుకుంటున్న ధాన్యం, మొక్కజొన్న పంటలను, మామిడి తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 75 కిలోలు ధాన్యం బస్తాను రూ.1,730లకు తీసుకుంటామని సొసైటీ అధికారులు చెబుతున్నారు గాని ఆ విధంగా తీసుకోవడం లేదన్నారు. మిల్లర్లు, దళారులు ఏకమై బస్తా ధాన్యం రూ.1,270లకు తీసుకుంటామని చెబుతున్నారని, ఈ విధంగా అమ్మితే రైతులు కోలుకోలేని నష్టాలకు గురవుతారన్నారు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్, నాయకులు జమ్మి వెంకటేశ్వరరావు, ఎం.గురవయ్య, రైతులు పాల్గొన్నారు.

వావిలాల సొసైటీపై రైతుల ఫిర్యాదు

వావిలాల(తిరువూరురూరల్): రబీ ధాన్యం కొనుగోలులో తిరువూరు మండలం వావిలాల పీఏసీఎస్ సిబ్బంది వివక్ష ప్రదర్శిస్తున్నారని రాజుగూడెం గ్రామ సన్న, చిన్నకారు రైతులు ఆరోపించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా అసలే దిగుబడులు తగ్గే పరిస్థితులు నెలకొనడంతో త్వరితగతిన ధాన్యం విక్రయించాలని తాము ప్రయత్నిస్తుండగా, వావిలాల సహకార సంఘ సిబ్బంది తమకు కనీసం ధాన్యం సంచులు ఇవ్వట్లేదని, నమూనా తీసి ధర నిర్ణయించట్లేదని వాపోయారు. రోజుల తరబడి తాము సొసైటీ చుట్టూ తిరుగుతున్నా స్పందించని సిబ్బంది, రాజకీయ నేతలు, పెద్ద రైతుల ఇళ్ల వద్దకు, పొలాల్లోకి లారీలు పంపి ధాన్యం సేకరిస్తున్నారని ఆరోపించారు. సొసైటీ సిబ్బంది పేద దళిత రైతులను పట్టించుకోవడం లేదని జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు.

జామియా మసీదు కమిటీ ఎన్నిక

విస్సన్నపేట: విస్సన్నపేట జామియా మసీదు కమిటీకి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ జానీ, ఉపాధ్యక్షుడిగా షేక్ యాసిన్, కార్యదర్శిగా సయ్యద్ అక్రం, కోశాధికారిగా షేక్ నాగూర్ బాషా, 12 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.